# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 10-06-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాజధాని అమరావతిలో రెండు కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులకు ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది.
- ❖ రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులు మెరుగుపరిచినట్లు మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి చెప్పారు.
- ❖ రాష్ట్రంలో విబి జి-రామ్-జి పథకాన్ని అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 7 వేల 707 కోట్ల రూపాయలను కేటాయించింది.
- ❖ నైరుతి రుతుపవనాలు రాబోయే 3-4 రోజుల్లో రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలకు మరింత విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

====================

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి రెండు కీలక కేంద్ర ప్రాజెక్టులను ప్రభుత్వం కేటాయించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ రెండు కేంద్ర ప్రభుత్వ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఈరోజు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టులలో భాగంగా 1,299 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో కేంద్ర ప్రభుత్వ సాధారణ కార్యాలయ భవన సముదాయం (CGGPOA)ను, 1,234 కోట్ల రూపాయాల వ్యయంతో ఉద్యోగులకు నివాస భవన సముదాయం (GPRA)ను నిర్మించనున్నారు. రాష్ట్రానికి కేటాయించిన ఈ ప్రాజెక్టులపై కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ న్యూఢిల్లీలో పాత్రికేయులతో మాట్లాడుతూ...

(వాయిస్ 30 సెకన్లు)

====================

దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సఫలీకృతులయ్యారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసించారు. ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా చేసిన సామాజిక మాధ్యమ పోస్ట్ లో నరేంద్ర మోదీ నేతృత్వంలో భారత్ అద్భుత శక్తిగా ఎదుగుతోందని పేర్కొన్నారు. ప్రధానిగా నరేంద్ర మోదీ 4 వేల 399 రోజుల నిరంతర పాలన ప్రతి స్థాయిలో భారతదేశాన్ని పరివర్తన చెందించాలనే అద్వితీయమైన కృషితో నిండి ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున.. ఈ అద్భుతమైన మైలురాయిని చేరుకున్నందుకు నరేంద్ర మోదీకి హృదయపూర్వక అభినందనలు తెలియజేసారు.

====================

విబి జి-రామ్-జి పథకాన్ని రాష్ట్రంలో అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 7 వేల 707 కోట్ల రూపాయలను కేటాయించింది. దేశంలో మూడవ అత్యధిక కేటాయింపులను ఆంధ్రప్రదేశ్ దక్కించుకోవడం సమర్థవంతమైన అమలు పట్ల తమ నిబద్ధతకు బలమైన నిదర్శనమని ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఈ కేటాయింపులు గ్రామ మౌలిక సదుపాయాలను బలోపేతం చేసి జీవనోపాధిని మెరుగుపరుస్తాయని తెలిపారు. దేశ అభివృద్ధికి చోదకశక్తిగా ఉన్న రైతులు, మహిళలు, శ్రామికులకు మరిన్ని అవకాశాలను సృష్టిస్తాయన్నారు. గ్రామీణాభివృద్ధిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఉన్న అచంచలమైన దృష్టికి ఇవి తార్కాణమని ఉపముఖ్యమంత్రి సామాజిక మాధ్యమ ప్రకటనలో కృతజ్ఞతలు తెలియజేసారు.

====================

రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాలను గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేశామని ఆ శాఖా మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి తెలిపారు. గడిచిన రెండేళ్లలో సాంఘిక సంక్షేమ శాఖ చేపట్టిన అభివృద్ధి పనుల గురించి అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఆయన ఈరోజు పాత్రికేయులకు వివరించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనలో భాగంగా తమ ప్రభుత్వ పరిపాలన సాగుతోందని, రాష్ట్రంలో స్టడీ సర్కిళ్లను మరింత బలోపేతం చేశామని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్ లో మంచి ఉత్తీర్ణత సాధించామని తెలిపారు. విద్యార్థులకు సురక్షిత, పరిశుభ్రమైన, వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం విస్తృత స్థాయిలో చర్యలు చేపట్టిందని మంత్రి తెలియజేశారు. 104.96 కోట్ల రూపాయల వ్యయంతో హాస్టళ్ల మరమ్మతులు, అభివృద్ధి పనులు చేపట్టి 774 హాస్టళ్లలో మౌలిక వసతులు మెరుగుపరిచామని చెప్పారు. ఈ నెలాఖరు నాటికి రాష్ట్రంలోని అన్ని వసతి గృహాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు ప్రక్రియ పూర్తి కానుందని మంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

====================

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. సాలూరు మండలం సారిక పంచాయతీ పరిధిలోని దండిగాం నుంచి నేరాళ్లవలస వరకు సుమారు కోటీ 90 లక్షల రూపాయల అంచనా వ్యయంతో పునర్నిర్మించిన బీటీ రహదారిని మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ రహదారి వల్ల దండిగాం, నేరాళ్లవలస గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయని చెప్పారు.

====================

ప్రముఖ చలన చిత్ర దర్శకులు భారతీరాజా మరణం బాధాకరమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమలకు భారతీరాజా చిరస్మరణీయ చిత్రాలు అందించారని, భారతీయ సినీపరిశ్రమకు ఆయన మరణం తీరని లోటని సామాజిక మాధ్యమ పోస్ట్ లో పేర్కొంటూ.. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అదే

విధంగా భారతీరాజా మృతి పట్ల సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గ్రామీణ నేపథ్య చిత్రాలకు సరికొత్త ప్రాణం పోసిన మహోన్నత దర్శకుడు భారతీరాజా అని ఎందరో నూతన నటీనటులను సినీ పరిశ్రమకు పరిచయం చేసిన `దర్శక శిఖరం` అని సామాజిక మాధ్యమ పోస్ట్ లో మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. భారతీరాజా తెరకెక్కించిన సీతాకోక చిలుక, ఎర్రగులాబీలు, చిరంజీవి నటించిన ఆరాధన చిత్రాలు తెలుగు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆరు జాతీయ పురస్కారాలు, నాలుగు ఫిల్మ్ ఫేర్ అవార్డులు అందుకున్న భారతీరాజాను 2004లో భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.

====================

వైద్య సేవల్లో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగాన్ని ప్రభుత్వం క్రమంగా పెంచేందుకు ప్రయత్నిస్తోందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ క్రమంలోనే మధుమేహంతో కంటి చూపు సమస్యలు (రెటినోపతి) కలిగిన వారికి తగిన సమయంలో చికిత్స అందించడంలో ఏఐ వినియోగాన్ని  ప్రయోగాత్మకంగా గుంటూరు, కర్నూలు, విశాఖలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రవేశపెట్టాలని నిర్ణయించామన్నారు. ఫండస్ కెమెరాల ద్వారా తీసే ఇమేజ్ ను పరిశీలించి.. రెటినోపతి సమస్య ఎంత తీవ్రంగా ఉంది? వైద్యులను సంప్రదించాలా? వద్దా? అనే దానిపై ఏఐ స్పష్టత ఇస్తుందన్నారు. ప్రస్తుతం వైద్యులు అందుబాటులో ఉన్నచోట మాత్రమే ఫండస్ కెమెరాలు ఉన్నాయని, ఏఐ సేవల రాకతో ఫండస్ కెమెరాలు, అప్టోమెట్రిస్ట్ (టెక్నిషియన్)లను అందుబాటులోనికి తీసుకువస్తే సరిపోతుందని స్పష్టం చేశారు. రెటినోపతి సమస్యలు గుర్తించడంలో వైద్యుల కొరతను అధిగమించేందుకు AI సహాయపడుతుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈరోజు ఒక ప్రకటనలో వెల్లడించారు.

====================

నైరుతి రుతుపవనాలు రాబోయే 3-4 రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లోని మిగిలిన ప్రాంతాలకు మరింత విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. అదే విధంగా మధ్య బంగాళాఖాతం నుండి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అంతర కర్ణాటక మీదుగా వున్న నిన్నటి అల్పపీడన ద్రోణి సగటు సముద్ర మట్టానికి 3.1 నుండి 5.8 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి కొనసాగుతోందని తెలియజేశారు. మరిన్ని వివరాలని వాతావరణ శాఖాధికారిణి  జి.లక్ష్మీ వెల్లడిస్తూ…

(వాయిస్ 28 సెకన్లు)

ఇక మార్కాపురంతో పాటూ రాయలసీమ జిల్లాల్లో రేపు పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. అల్లూరి, పోలవరం, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కూరుస్తాయని వెల్లడించింది.

====================
====================